ఎమ్మెల్యే సంజయ్‌కు టీజీవోల శుభాకాంక్షలు

■ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ యాస్మిన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిసిన సంఘం నేతలు

జగిత్యాల ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంపై ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డిని, జగిత్యాల ఎమ్మెల్యేగా రెండోసారి విజయం సాధించిన డాక్టర్ సంజయ్ కుమార్‌ను బుధవారం జగిత్యాల జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాసన సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడంపై కలెక్టర్ యాస్మిన్ బాషాను తన కార్యాలయంలో బుధవారం జిల్లా టీజీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల బొకె అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, కోశాధికారి గణేశ్, అసోసియేటెడ్ అధ్యక్షులు అరిగెల అశోక్, కందుకూరి రవి బాబు, హన్మంతరావు, ఉపాధ్యక్షులు విజయేందర్, విశ్వన్, ప్రభు, కిరణ్, సంగి రాజేశ్వరి, శైలజారాణి, సలీం, ప్రవీణ్, సుష్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన లోక బాపురెడ్డి

కొప్పుల ఈశ్వర్‌తో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, డిసెంబర్ 13: హైదరాబాద్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను బుధవారం మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలు, భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు వారు తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో కోరుట్ల విద్యార్థి ప్రతిభ

కోరుట్ల, డిసెంబర్ 13: పట్టణానికి చెందిన ఆమెటి శ్రీరాం జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో ప్రతిభ చూపింది. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన శ్రీమద్భాగవద్గీత కంఠస్థ పోటీల్లో స్థానిక సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి శ్రీరాం 700 శ్లోకాలను కంఠస్థం చేసి శభాష్ అనిపించుకున్నాడు. కార్యక్రమంలో టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ మంచాల జగన్, న్యాయ నిర్ణేతలు గుడికందుల వెంకన్న, పాంపట్టి రవీందర్, తవుటు రాంచంద్రం, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పీఆర్టీయూ నేతలు

జగిత్యాల, డిసెంబర్ 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు ఆధ్వర్యంలో సంఘ బాధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

మేడిపల్లి, డిసెంబర్ 13: దమ్మన్నపేట గ్రామానికి చెందిన కళ్లెం మోహన్ రెడ్డికి చెందిన గేదె ఇటీవల కరెంట్‌షాక్‌తో మృతి చెందగా విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.40 వేల విలువైన చెక్కును ట్రాన్స్‌కో ఏడీఈ బొప్పరాతి రఘుపతి అందజేశారు. కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామం చెన్నవేని బక్కన్నకు చెందిన బర్రె మృతి చెందగా, బాధితుడికి రూ.20 వేల విలువైన చెక్కును ట్రాన్స్‌కో ఏడీఈ బొప్పరాతి రఘుపతి అందజేశారు. కార్యక్రమంలో మేడిపల్లి ట్రాన్స్‌కో ఏఈ విశ్వతేజ, సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, డిసెంబర్ 13: మల్యాల ఎక్స్‌రోడ్ వద్ద పెట్రోల్ పంప్‌నకు సమీపంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు మల్యాల ఎస్ఐ-2 కుమారస్వామి తెలిపారు. ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం సాయంత్రం పోతారం గ్రామానికి చెందిన స్వర్గం రవి తన సైకిల్‌పై పూడూర్‌లోని బీడీ కంపెనీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం సైకిల్‌ను ఢీకొనడంతో స్వర్గం రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

ధర్మపురి, డిసెంబర్ 13: పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఇంఫాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజిదా భాను, అధ్యాపకులు గీత, కవిత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

■ ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి
■ ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్, డిసెంబర్ 13: రైతులు, ప్రజలకు సాగు, తాగునీటికి, విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ మంచినీటి పథకాన్ని, రామాజీపేట గ్రామంలోనీ పంపు హౌస్‌ను ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ, మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఆటోడ్రైవర్లకు నష్టం కలుగుతున్నదని డ్రైవర్లు తమ దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వపరంగా ఆటో డ్రైవర్లను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు మ్యాకల రమేశ్, రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోయేటి మహిపాల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

■ అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ■ ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అడిషనల్ కలెక్టర్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 13: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధన కోసం శ్రమించాలని జగిత్యాల రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో తృతీయ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

వినతిపత్రాలు అందజేసిన ఆటో డ్రైవర్లు

రాయికల్: వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు

మెట్‌పల్లి, డిసెంబర్ 13: మెట్‌పల్లి నవయుగ తెలంగాణ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ ఆటో, మ్యాజిక్, జీపు డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని బుధవారం ఆర్డీవోకు పలు డిమాండ్లతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. మెట్‌పల్లి మినీ స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ తీసి నిరసన తెలిపారు. ఆర్టీసీలో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకం ద్వారా తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు గుగ్లావత్ శివలాల్, కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, గణేశ్, గంగాధర్, వెంకటరమణ, శంకర్, ఎండీ నవాబ్, లక్ష్మణ్, గంగాధర్, గట్టయ్య, మల్లేశ్, సంటి నర్సయ్య, వసీం, జావిద్, మొగిలి, పాషా యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్, డిసెంబర్ 13: పట్టణంలోని ఆటో, జీపు డ్రైవర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు జీవనభృతి కింద నెలకు రూ.20 వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో, జీపు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 13: చల్‌గల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామ బీఆర్ఎస్ నేత కమలాకర్‌రావు అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ గుగ్లిళ్ల హరీశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, నాయకులు నతువాల తిరుపతి, వెంకటేశ్, మహేశ్, ముత్యం, యూత్ అధ్యక్షుడు పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి

మెట్‌పల్లి, డిసెంబర్ 13 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నేత బర్ల కొండయ్య మరణించారు. కొంత కాలంలో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆయన తుది శ్వాస విడిచారు. కొండయ్య మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్, డిసెంబర్ 13: మండల కేంద్రానికి చెందిన గొట్టిపడ్డ రాజు జీవనోపాధికి గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లగా, అక్కడ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. రాజుకు అక్కడ చికిత్స ఖర్చులు, స్వదేశానికి రావడానికి రూ.5 లక్షల మేర కావాల్సి ఉంది. దీంతో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కనికరపు సంజయ్ రూ.10 వేలు, మచ్చర్ల ప్రభాకర్ రూ.5 వేలు, చిట్యాల లక్ష్మణ్ రూ. 5 వేల నగదును బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి

కోరుట్ల, డిసెంబర్ 13: స్వచ్ఛతకు పట్టణ ప్రజలు సహకరించాలని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా డిసెంబర్ 25 వరకు నిర్వహించే క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్‌ను పురస్కరించుకుని విద్యార్థినులు వ్యాపారులకు రాఖీలు కట్టి, తిలకందిద్ది స్వచ్ఛత సేవలపై పలు సూచనలు చేశారు. బహిరంగ మల మూత్ర విసర్జన చేయవద్దని, పబ్లిక్ టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పట్టణ ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన టాయిలెట్‌లను ఉపయోగించి బహిరంగ మల, మూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ అధికారి మహేశ్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

'మానస ఎక్స్‌లెన్స్'లో సైన్స్ ఫెయిర్

జగిత్యాల, డిసెంబర్ 13: జిల్లా కేంద్రంలోని మానస ఎక్స్‌లెన్స్‌లో బుధవారం 'సైన్స్ ఫ్యూజన్ ఫిస్టా డిసెంబర్ 2023' నిర్వహించారు. 6, 7, 8వ తరగతులకు చెందిన విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు దాదాపు 505 రకాల ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని మండల విద్యాధికారి జీ గాయత్రి, ఎన్‌సీఎస్ఈ అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం రాజశేఖర్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజితా రావు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్ రావు, మౌనికారావు, సుమన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. తల్లిదండ్రులతో ఓటింగ్ నిర్వహించి ఉత్తమ ఎగ్జిబిట్స్‌ని ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

క్రిస్టియన్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 13: క్రిస్మస్ పండుగ సందర్భంగా సామాజిక రంగం, విద్యా, వైద్యం, సాహిత్యం, కళా రంగం, క్రీడా రంగాల్లో ప్రతిభ చూపిన వ్యక్తులు, సంస్థలను ప్రభుత్వం సత్కరిస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సాయిబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రంగాల్లో 30 సంవత్సరాలకు పైబడి సేవ, ప్రతిభ చూపిన వారి నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్లను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం జగిత్యాలలో పొందవచ్చని సూచించారు. దరఖాస్తులు డిసెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-23391067 నంబర్‌ను లేదా జిల్లా మైనార్టీ అధికారి సంప్రదించవచ్చని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు జ్యోతి హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

జగిత్యాల, డిసెంబర్ 13: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థిని సంజన జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో నిర్వహించిన 67వ ఎస్జీఎఫ్ స్టేట్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించడంతో జనవరి 8 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బర్మార్‌లో నిర్వహించే 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు విద్యార్థిని సంజనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనికారావు, అజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.